# స్వయంకృతాపరాధం

ఉమాదేవి

కథానిక

అసెంబ్లీ ఐపోగానే పిల్లలంతా నిశ్శబ్దంగా లైన్లలో తరగతుల్లోకి వెళ్ళిపోయారు. హెడ్‌మిస్ట్రెస్ నందకళ్యాణి హుందాగా తన ఆఫీసు రూములోకి నడిచివచ్చింది. అసలు ఆమె నడకలోనే ఎక్కడలేని రాజఠీవి ఉంది. ఏ చీరకట్టినా ఏ రవిక తొడిగినా ఎనలేని అందమూ వాటికి వచ్చి కూచుంటుంది! మరి ఆ కట్టుకునే తీరులో ఉందో ఆ సొరు....లేక ఆ విగ్రహ నిర్మాణంలో వచ్చిందో ఆ అందం! ఉజ్వల శ్యామల వర్ణంలోనే ఎదటి మనిషిని నిలవేసే ఆకర్షణ!....అలాగని ఆమె విగ్రహ పుష్టి నైవేద్యనష్టి అన్న సూక్తిని ఋజువు చేసేలానూ ఉండదు....ఎదటిమనిషి మనసు నొవ్వకుండా లాలనగా నేర్పుగా పని రాబట్టే చాకచక్యం ఉందామెలో....అందుకే ఆమెను ప్రేమించకుండా ఉండలేరు ఆమెను ఎరిగున్న వాళ్లు. ఆఫీసుప్యూను షణ్ముగం టపాల్సుతేగానే ముందు మిగిలిన అసిస్టెంట్సు ఉత్తరాలన్నీతీసి ఎవరివి వారికి పంపించి స్వంత టపా వేరొక వైపుపెట్టి ఆఫీసు టపా విప్పింది నందకళ్యాణి. వచ్చిన ప్రొసీడింగ్సు అన్నీ వివరంగా ఫలాని ఫైలుకని రాసి సంతకాలుపెట్టి మిగిలినవికూడా చూచి జాబులు రాయవలసిన వాటికి క్లర్కుకు పురమాయించవలసినదంతా చెప్పాక స్వంత జాబులు చూచుకోటానికి ఉపక్రమించింది.

ఒకటి తన కోటీచరురాసిన ఉత్తరం....రెండోది నీలంకవరు ....చూస్తూనే చిరునవ్వు నవ్వుకుంది...అదెక్కడినుంచో తనకు పైదస్తూరీ చూడగానే తెలుసుగా. అందుకే మిగిలిన పని అంతా అయేదాకా దాన్ని ముట్టుకోదు. దరహాసం చేస్తూనే కవరు విప్పింది. తీరా ఉత్తరం చదువుతూ ఉండగానే ఆమె మొహం వివర్ణమయిపోయింది. నగంలో ఆపితమాయించుకుని ఆఫీసురూముతలుపు గడియ వేసి వచ్చి కుర్చీలోకూర్చుని మిగిలింది చదువుకుంది....అలాగే టేబిల్‌మీద తలవాల్చి పడిపోయింది....బైట కూర్చున్న జవాన్లు తెల్లబోయారు....

అప్పుడు మూసిన తలుపులు మధ్యాహ్నం ఒంటిగంటదాకా మళ్లీతెరుచుకోలేదు. షణ్ముగం లాంగ్‌బెల్ కొట్టగానే పిల్లలూ, టీచర్లూకూడా మధ్యాహ్నం యింటర్వెల్‌లో యిళ్ళకు వెళ్ళిపోయారు. కాసేపటికి మెల్లిగా తలుపు తెరుచుకుని కళ్యాణి యివతలకు వచ్చింది.

భయంగానే సంకోచంతో, 'అమ్మా—కేంటీన్‌కువెళ్ళి కాఫీ టిఫిన్ తెమ్మంటారా?' అని అడిగాడు షణ్ముగం.

"వద్దు షణ్ముగం—నాకు బాగాలేదు. తలనొప్పిగా ఉంది. మిగిలిన ప్యూన్సును భోజనానికి వెళ్ళమను—వాళ్లు వచ్చాక నీవు వెళ్ళి వద్దువుగాని" అందావిడ. అయినా షణ్ముగం సైకిలుమీద వెళ్ళి కేంటిన్‌లోంచి కాఫీతీసుకుని దగ్గర్లోనే ఉన్న మెడికల్ షాపులో శారిడాన్ బిళ్ళ కొనుక్కుని తెచ్చాడు పది నిమిషాల్లో.

"అమ్మా—యీ బిళ్ళ వేసుకొని యీవేడి వేడి కాపీ తాగండి. స్పెషల్‌గా చేయించి తెచ్చాను. తలనొప్పి తగ్గుతుంది" అన్నాడు బ్రతిమాలే ధోరణిలో. అతని అబిమానానికి ఆమె హృదయం ద్రవించి పోయింది. వీళ్లంద రికీ తనంటే యింతప్రేమ దేనికో....విషాదంగా నవ్వుకుంది.

వద్దంటే పావం వాడు నొచ్చుకుంటాడని బిళ్ళ వేసుకొని కాఫీ తాగింది. మధ్యాహ్నం అర్జంటుగా పంపవలసిన టపాల్సు స్వయంగా చూసుకొని స్కూలు అవగానే జాగ్రతగా తాళాలు వేయించి తనకు పంపమని ఫస్ట్ ఆసి స్టెంటుకు చెప్పి పంపి షణ్ముగం తీసుకొచ్చిన రిక్షాఎక్కి యింటికి వచ్చేసింది నందకళ్యాణి..,

* * *

రోజుకంటే ముందే వచ్చిన అమ్మనుచూచి బాబ్జీ పట్టలేని సంతోషంతో గంతులేస్తూ దగ్గ రకు రాబోయాడు....వాడి అమాయకమైన మొహంలోకి చూచేటప్పటికి కల్యాణికి దుఃఖం పొర్లుకువచ్చింది. దుర్బరమైన ఆవేదనతో వాణ్ణి అమాంతం హృదయానికి హత్తుకుని కళ్ళ నిండా నీళ్ళు తిప్పుకుంది....ఆ పసివాడికిది విచిత్రంగా ఉంది. అమ్మకు తనమీద ప్రేమ ఉందనయితే తెలుసునుగాని యిలా ఎప్పుడూ అమ్మ చేయలేదు!....అమ్మ కళ్ళల్లో నీళ్లు న్నాయి దేనికో....అమ్మ నెవరు కోడతారు? అక్కకూడా బడినించి యింకా రాలేదు. మెత్తని బుల్లి చేతుల్తో అమ్మ నున్నని బుగ్గల మీదుగా ముత్యాల్లాగా జారే కన్నీటిని తుడుస్తూ.

"యేడవద్దమ్మా—జరమొచ్చిందా?" అన్నాడు ముద్దుగా—దిగులుతో బిక్కమొహం వేసుకుని.

పసివాడిముందు తన బలహీనతను బైట పెట్టుకున్నందుకు సిగ్గుపడుతూ మరుక్షణంలో "ఏం లేదుగానీ—పోయి ఆడుకో" అని వాణ్ణి అవతలికిపంపి తన గదిలోకి వెళ్ళి తలుపేసు కుంది. ఆఫీసు బట్టలయినా మార్చకుండా అలాగే మంచంమీద పడిపోయి ఎంతసేపు ఏడ్చిందో!

బైట రేణుక బడినుంచి వచ్చిన అలికిడి అయి పిల్లల ముందు తన పరిస్థితి ఎందుకు బైట పడాలని మొహం తుడుచుకుని యివతలకువచ్చి బాత్‌రూములోకి వెళ్లి స్నానంచేసి వచ్చింది త్వరగా.

రేణుక రాగానే బాబ్జీకూడా జంకుతూ వచ్చాడు ఆమె వెనకే తల్లి గదిలోకి. పిల్లల్ని దరిని దగ్గర కూర్చోబెట్టుకుని వంటావిడ తెచ్చిన కాఫీ ఫలహారం యిద్దరికీ బుజ్జగించి ఆప్యాయంగా పెట్టి తినిపించింది కల్యాణి. తరువాత వాళ్ళిద్దరూ అమాయకంగా నవ్వుతూ ఆడుకోటానికి డాబామీదికి పరుగెడుతూ ఉంటే జాలిగా వాళ్ళవైపు చూచి నిట్టూర్చింది....

* * *

రాత్రి భోజనాలయాక పిల్లలిద్దరూ కాసేపు కబుర్లాడి రేడియో వింటూనే నిద్రపోయారు. రేడియో ఆపేసి తలుపులన్నీవేసి స్టడీ రూములోకి వెళ్ళింది కల్యాణి....ఉదయం వచ్చిన జాబును మళ్ళీ తెరిచింది....

"నా కల్యాణీ....

ఒకనాడిలాంటి జాబు రాయవలసి వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. కానీ పరిస్థితులిలా తయారు చేశాయి నన్ను—అసలీ జాబునెలా మొదలెట్టాలో ఎలా వ్రాయాలో కూడా తెలియటం లేదంటే నమ్ము....సామాన్యమైన దుర్బలహృదయులయితే యిది చదివి ఏమయిపోతారో కూడా....నీవు మంచి గుండె నిబ్బరం కలదానివి—నాకంటేగూడా—అని నాకు తెలుసు....అందుకే రాయకతప్పని పరిస్థితులు నన్ను ప్రోత్సహించటాన రాస్తున్నాను, ప్రియతమా! నీవు ఏమాత్రం నా విషయంలో జాగ్రత్త వహించినా నేనీనాడిలా పతనమయి ఉండేవాణ్ణి కాదేమో అనిపిస్తోంది...."

కంటికి కడివెడుగా ఏడ్చింది కల్యాణి.

"అవును కల్యాణీ....కానీ యిందుకు నేను ఎవరినీ ఏమీ అనను—అయితే నన్ను నేను నిందించుకోలేను కూడా! ఇందులో నాతప్పు ఏమీలేదేమో—ఇంద్రియాలను వశపరచుకోలేక పోయాననే దోషం తప్ప. నీమీద నాకు విపరీతమైన ప్రేమా, గౌరవాలున్నాయి. తొలి

రోజుల్లో నిన్నెంతగా ప్రేమించి ఆరాధించానో అంతటి ఆరాధనా యీనాడూ ఉంది. నే నీనాడిలా అవటము నీమీది ప్రేమ లోపించి కాదు కల్యాణీ-నన్ను నేను లొంగదీసుకోలేక....నా పరిస్థితిలో ఉన్నవారిలో చాలామంది ఇలాగే తయారవుతారేమోనని నా అనుమానం! అది కేవలం నిరాధారమైన ఊహే అనుకో....''

ఉప్పెనగా వచ్చే దుఃఖాన్ని బలవంతాన ఆపుకుంది కల్యాణి. స్వయంకృతాపరాధం! తనుమటుకు అలా జరగాలనుకుందా....తనలో మటుకు కోరికలు లేవా? ఇలాంటి పనే చేసిందా తను? పొరపాటునయినా పరాయి మగాణ్ణి గురించి తలచలేదే! ఇతడుమటుకు యెందుకిలా చేయాలి?

''ఈ మాటలు చదివి నీవేమనుకొంటున్నావో నాకు తెలుసు కల్యాణీ! కానీ నీ పరిస్థితి వేరు....మగవాణ్ణి నా పరిస్థితి వేరు. ఐనా నిన్నేమీ అనను. నావల్ల నీకే లోపమూ రానియ్యను. నీకోసం నేను నావాళ్ళతో కూడా సంబంధాలు తెగతెంపులు చేసుకువచ్చానని నీకు తెలుసు....కాలేజీలో చదివే రోజుల్లో నీతో వాగ్దానం చేసినవిధంగా ఏనాడూ నీ అభిరుచులకు భిన్నంగా అవరోధాలు నేను కలిగించలేదు. విద్యావతి ఐన స్త్రీ స్వయంపోషకురాలవాలి-పురుషులు ఆమె ఉద్యోగం చేయటానికి అభ్యంతరపరచగూడదు అన్న నీ అభిప్రాయాన్ని నేను గౌరవించి బలపరిచాను. తత్ఫలితంగా యీనాటికీ కుసుమకోమల సదృశమైన నీ సుకుమార దేహం ఆఫీసుపనిలో ఎప్పుడూ నలిగిపోతున్నా లోలోపలే బాధపడ్డానుగానీ నిన్ను ఉద్యోగం వదులుకోమనీ అనలేకపోయాను. కారణం—నా స్వార్థమనిగానీ స్త్రీ ఉద్యోగం చేయటం పరువు తక్కువని నే ననుకొంటున్నాననిగానీ నీ వెక్కడ నొచ్చుకొంటావో అని...!

ఇల్లాలు ఆఫీసుపనితో సతమతమయిపోతూ ఉండటం చూస్తుంటే, ఆ కష్టమేమిటో తెలిసి నిజసతిపై యదార్థంగా ప్రేమగల పతి హృదయం ఎలా గిలగిల్లాడిపోతుందో అనుభవం ఉంటేగాని అర్థంకాదు!

నిజానికి వివాహం అయాక ఏ రెండు నెలలైనా ఇద్దరం కలిసి ఉన్నామో లేదో, మన దాంపత్య జీవితం అంతా ఉత్తరాల్లోనే గడిచిపోయేలా ఉంది. బి. ఏ. పేసయాక పెళ్ళి అవగానే అటు నీవు బి. యి. డి. కి వెళ్లటమేమిటి, యిటు నేను క్లర్కుగా జేరటమేమిటి ఒకసారే జరిగిపోయాయి....తరువాతైనా నిన్ను మరోచోట పోస్టుచేశారు....ఈ వియోగము దుర్భరమూ దుస్సహమే ఐనా తలఒగ్గక తప్పిందికాదు తక్కువ జీతం తెచ్చేదికాక, ఎదురు సంపాదించి యిస్తున్న నిన్ను ఏ మొహంతో మాని నాదగ్గరకు వచ్చి ఉండమంటాను. అదిగాక మన ఆదర్శాలూ ఆశయాలూనో!''

కల్యాణికి తమ వివాహం అయాక అప్పటి జీవితం కళ్ళల్లో మెదులుతోంది తనకు మటుకు ఎంత బాధగా ఉండేది శేఖరాన్ని వదిలి ఉండటం....కాని కొద్ది జీతంతో గడుపుకోటం ఎలా? ఇంత చదువు చదువుకుని ఊరికే యింట్లో కూచోటంకంటే తానూ ఉద్యోగం చేసి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా సంపాదించి తమ జీవితాన్ని సుఖమయం చేసుకోవటం మంచిదిగనూ అనిపించింది....సాధారణంగా అందరికీ రాని అవకాశం గవర్నమెంటులో తనకు లభించింది .... అయితే అప్పటినుంచీ యిద్దరూ దూరమయిపోయారు .... ఇద్దరికీ ఒకే ఊళ్ళో ఉద్యోగం లభించనేలేదు.

"నిన్ను చూడకుండా ఉండలేకపోయేవాణ్ణి మొదట్లో వారం వారం విధిగా వచ్చేవాణ్ణి.... తరువాత తరువాత పదిహేను రోజులకూ యిరవై రోజులకూ వస్తూ ఉండేవాణ్ణి—నా జీతమంతా చార్జీలకే వదులుతోందా అనిపించేది చూచేవాళ్ళకు—తీరా నేను వచ్చేసరికి ఎప్పుడూ ఏదో ఆఫీసు పనితో సతమతమయ్యే నిన్ను చూసి నాహృదయం కృంగిపోయేది....ఒకవారం సిలబసులు రాయాలని కూర్చునేదానివి. ఒకసారి ఏవో ప్రాక్టికల్సు ఉన్నాయి ప్రైవేటు క్లాసులు పెట్టాలని వెళ్ళేదానివి....మరోసారి స్కూలు యిన్స్పెక్షన్—ఇంకోసారి యూనివర్సరీ ఇలాగే ఎప్పుడూ ఏదో రకంగా బిజీగానే ఉండే

దానివి....పోనీ శలవల్లోనయినా తీరికేమో అనుకోటానికి ఏవో ట్రైనింగులూ,ఎక్స్కర్షనులూ అవ్వ దేవచ్చేవి....ఎంత ఉత్సాహంతో వచ్చే వాడినో అంత నిస్పృహతో తిరిగి వెళ్ళేవాడిని.

ఇదంతా నిన్ను నొప్పించి తూలనాడటానికి అంటున్నాననుకోవద్దు కల్యాణీ. గతాన్ని ఒక్క సారిగా సింహావలోకనం చేయిస్తున్నాను. సంవత్సరం మొత్తంమీద ఏ నెలరోజులు కలిసి మెలిసి ఉండేవాళ్ళమో ఆనందంగా—నాకు యీ హొటలు భోజనమూ ఏకాంతవాసమూ అయితే అటు నీ అవధానమంతా స్కూలే తీసుకుంది — నా ప్రియతమ సౌందర్యాన్ని నేను ఆరాధించి ఆస్వాదించుకోకుండా ఆ బడి పనిలో ఆమె నలిగి తనలావణ్యాన్నంతా కోల్పోతుంటే ఎంత బాధపడి పోయేవాణ్ణో .... ఇలా మన వైవాహిక జీవితంలో మొదటి రెండు సంవత్సరాలూ ఊరికే గడిచిపోయాయి .... ఇంతలో రేణుని నీవు ధరించటం జరిగింది. అప్పుడు మరింత బాధపడేవాణ్ణి నేను. పువ్వులాగా సున్నితంగా చూసుకోవాల్సిన స్థితిలో నీవు వెనుకతోడు లేకుండా తొమ్మిది నెలలూ బడికి వెళ్ళివస్తోంటే నీకేవిధంగానూ సహాయపడలేని నన్నూ, నా అసమర్థతను నేనెంతగా నిందించుకున్నానంటావ్? ఈ వి వా హం మ్మూలాన పెద్దదిక్కు అన్నది మనకు కరువయింది. పాపకు రెండు నెలలు నిండీ నిండకముందే మళ్ళీ నీవు డ్యూటీలో చేరిపోయావు. ఎంతమంది ఆయాలున్నప్పటికీ మన పిల్లల్ని మనం చూచుకున్నట్లు చూస్తారంటావా?

ఏడు సుదీర్ఘ సంవత్సరాలిలాగే గడిచాయి. నేను కుటుంబం ఉండీ వంటరిగాణ్ణయాను. నీవు మాతృమూర్తివయాక కనీసం బిడ్డల్ని అనుదినం చూచుకుంటూ ఉండటాన ఐనా యీ ఎడబాటు నిన్నంతగా బాధించటము లేదేమో....కానీ కల్యాణీ "నాతిగల బ్రహ్మచర్యం" చేయగలగటం ఎంతకాలం సాధ్యమవుతుంది చెప్పు? చుట్టం చూపులా నిన్నూ పిల్లల్నీ ఎప్పుడో ఓనాడుచూడటంజరుగుతోంది.

పోనీ నాకు తహసీల్దారుగా ప్రమోషను వచ్చింది గదా-ఇకనైనా మనం పిల్లలతో ఒక చోటకు చేరుకొని ఉందామా అనుకొంటూ ఉండగానే యింతలో నీకూ హెడ్మిస్ట్రెస్గా ప్రమోషను వచ్చింది....నిన్ను మానుకోమని నేనుమటుకు ఎలా అనగలను చెప్పు?....ఐనా నీకే తోచకపోతుందా అని ఊరుకున్నాను. కాని నీవు రోజురోజుకీ పెరిగిన హొదాకి తగ్గట్టు వృత్తిమీద మరింత శ్రద్ధాశక్తులు కనవరచటం మొదలుపెట్టావు—అదీ మంచిదే-నీవు శ్రద్ధగా పనిచేయగలవనేగదా ప్రమోషన్ యిచ్చింది!

కానీ-కల్యాణీ....ఇది రెండు పడవలమీద ప్రయాణం చేయటంలాంటిదేమో అనిపిస్తుంది యిప్పుడు తలుచుకుంటుంటే! నే నిలా అంటున్నానని కోపం తెచ్చుకోకుండా ఒక్కసారి హృదయంమీద చెయ్యి వేసుకుని ఆలోచించు కల్యాణీ-గృహిణిగా ఎంతవరకూ నీ ధర్మం నెరవేరుస్తున్నావో?''

వేడెక్కిపోయిన నుదుటిని చేతితో కొట్టుకుంది కల్యాణి. కళ్ళు తుడుచుకొని టేబిల్మీద ఉన్న భర్త ఫొటోకేసి ఓసారి చూచిం ప్రసన్న వదనంతో ఉన్నాడు చంద్రశేఖరం అందులో....పాపం! తనను ప్రేమించి తనవాళ్లనందరినీ కాదని ఎదిరించి మరీ పెళ్ళాడాడు, ఫలితంగా తననుండి అతనికి లభించిందేమిటి? .... ప్రశాంతమైన గృహజీవితము అతనికి లభ్యమవకుండా చేసింది తను-తన ఆదర్శంకోసం, ప్రమోషను రాగానే పై ప్రమోషను కోసం యింకాయింకా వృత్తిమీదనే దృష్టి మళ్ళించుకుంది....తన ఎదురుగుండా పిల్లలు ఐనా ఉన్నారు—అతనికో? ఆఫీసు-హొటల్లో గది! తప్పించి వేరే ఏముంది....తననుంచి అతడు పొందుతున్న సుఖం అంతేగా! అలాగని తన కుటుంబ క్షేమంకోసం ఉద్యోగ ధర్మాన్ని సవ్యంగా నిర్వర్తించకుండా ఉంటే ప్రభుత్వానికి దండగచేయటం అవదా? ఏ ఒక్కటి సవ్యంగా నిర్వర్తించాలన్నా రెండో ధర్మ నిర్వహణలో లోపం కనపడక మానదు. ఆయన అన్నట్టుగా యిది రెండు పడవలమీద ప్రయాణంలాంటిదేనేమో!

"కుటుంబ జీవితం-పిల్లల ప్రేమా-వాళ్ళ ముద్దూ ముచ్చటా నేను చూచుకునేందుకు

ఎలాగా లేదు. నీవయినా పగలంతా స్కూల్లోనే గడిపి సాయంత్రానికి విసుగ్గా యింటికివస్తావు. వాళ్లతో ఎంత సమయం సరదాగా గడప గలవు? మరి కాసేపటికి వాళ్ళు నిద్రపోతా రాయె....అదీ నే ననను. కన్నతల్లివి నీకంటే నా కెక్కువ తెలునుగనకనా!

ఐతే కల్యాణీ ...ప్రస్తుతం జరిగిన సంఘట నలు విను. ఎన్నో సంవత్సరాలనుంచీ నిశ్చల మైన హృదయంతోనే ఉన్నాను. అనుక్షణము చుట్టుముట్టి లొంగదీసుకోటానికి ప్రయత్నించిన ఆకర్షణలను మనోబలంతో ఎదుర్కొంటూనే వచ్చాను—కానీ కల్యాణీ....రోజులు గడిచే కొద్దీ అటు ఆఫీసుపని పెరగటం బాధ్య తలు ఎక్కువటం ప్రారంభమయ్యాక నిగ్రహ శక్తి తగ్గటం మొదలెట్టింది....క్లర్కుగా ఉన్న ప్పటికంటె ఆఫీసరయాక నాలో ఆకర్షణ ఎక్కు వగా కనిపించిందేమో యితరులకు. .శోధనలు పెరగటం మొదలుపెట్టాయి....ఒక్క మాటలో చెప్పకోవాలంటే భౌతిక వాంఛలు నన్ను ఆవ రించుకుని లోబరచుకోటం మొదలుపెట్టాయి. ఇది నా లోపం కాదనను—అయితే తప్పవునో కాదో నిర్ణయించమని నీకే వదులుతున్నాను... ఇంటికి వచ్చేసరికి ఆనందమయమైన గార్హస్థ్య జీవితమేగనక ఉంటే ఇలా పతనమయేందుకు అట్టే అవకాశం ఉండేది కాదేమో....అదే కరువయింది నాకు. అక్కడికీ ఒకసారి రాశాను నీకు, ఆ విషయం—మర్చిపోయావేమో....''

లేదు....తనెలా మర్చిపోగలదు? ఆరు నెలల నాడు ఆయన తనకు రాశారు....

''నా కల్యాణీ....ఇక నా చేతిలోలేదు.... ఇలా కొన్నాళ్ళుంటే నేనేమవుతానో ఏం చేస్తానో నాకు తెలీదు—నీ భర్తను నీవే రక్షించుకో....'' అని...అప్పడేదో తమాషాలే అనుకుంది తను. వివరంగా ఉత్తరం రాయాలనుకున్నా ఇన్స్పెక్షను దగ్గరకు రావటాన ఆ గొడవల్లో మునిగి పోయి ఈ సంగతే పూర్తిగా మర్చిపోయింది. అదే యింతటి విషమ పరిస్థితులకు దారితీస్తుం దని ఆరోజు అనుకోలేక పోయింది.

''ఇది నీకు రాయటానికి నిజంగా సిగ్గుగానే ఉంది....అయినా రాయక తప్పదు—ఈ ఊళ్ళో నేనుంటున్న యింటివారి అమ్మాయి ప్రమీల కాపరానికి వెళ్ళిన ఏడాదిలోనే భర్త పోతే పుట్టింటికి వచ్చేసి మూడేళ్ళనించీ యిక్కడే ఉంటోంది....దురదృష్టవశాత్తూ దైవికంగానే అనుకో—ఆమెతో నాకు పరిచయం తటస్థించింది. ఏమంత గొప్ప అందమైన మనిషేమీకాదు—ఆ విషయంలో నీ కాలిగోటికి కూడా చాలదనుకో—''కల్యాణి మనను కొద్దిగా ఊరడిల్లినా అసూయతో తిరిగి చదవటం మొదలు పెట్టింది.

''మొదట్లో ఎంతో తప్పకు తిరిగాను....కానీ భౌతిక వాంఛలకు లొంగిపోక తప్పిందికాదు... నేను వివాహితుణ్ణనీ భార్యా బిడ్డలున్నారనీ కూడా తెలుసు ప్రమీలకు. కాకపోయినా యీ అక్రమ సంబంధంవల్ల ఎలాంటి విపత్కరమైన విపరీత పరిణామాలు వచ్చేదీ తెలియనంతటి పసిపిల్లయేమీ కాదు ప్రమీల. ఆమె ప్రోత్సాహం నన్ను వెర్రివాణ్ణి చేసింది....ఒకానొక దుర్ము హూర్తంలో లొంగిపోయా నామెకు....పొరపాటు జరక్కుండానే ఉండాలిగాని అది జరిగాక అల వాటయిపోవటానికి ఎంతసేపుకావాలి కల్యాణీ? తలచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది.... ఇంద్రియ వాంఛలు ఆదర్శాలను సైతం అణచి వేస్తాయికదా కొన్ని సమయాల్లో! ప్రమీలా నేనూ కలుసుకోటం రహస్యంలోంచి బహిరం గంలోకి దిగింది. వాళ్ళవాళ్ళకు తెలిసి నిగ్గ దీశారు. ఇంతలో ప్రమీలకూడా-ఏం రాయమం టావు కల్యాణీ? యీ పరిస్థితిలో ఏంచేయాలి? నేను వదిలేస్తే యీ క్షణాన ఆమె ఏ నూతి లోనో దూకుతుంది. అ బెంగతో తల్లిదండ్రులూ మంచంపట్టి మరణిస్తారు....

జరిగింది తప్పేనేమో....కానీ కల్యాణీ....నే నెప్పడూ నిన్నో స్నేహితునిలా చూచు కున్నాను. యీ పరిస్థితిలో నీవే సలహాచెప్ప. ఆమె జీవితం నాశనం చేయమంటావా? నేనేమీ గొప్ప సంస్కర్తనని గొప్పలు చెప్ప కోను. భార్యకే ద్రోహంచేస్తున్న నేనూ ఓ సంస్కర్తనేనా?

....కల్యాణీ! నీముందు ఒక నిజాన్ని ఒప్ప కోకుండా ఉండలేను. నాకు అనుక్షణం నన్ను

కనిపెట్టుకొని ఉండి యింటి వ్యవహారాలన్నీ తనే చూచుకొంటూ నాకు సుఖాన్ని కలిగించే గృహ వాతావరణాన్ని సృష్టించి యిచ్చే యిల్లాలుకావాలి—నా అన్నిరకాల ఉద్రేకాలనూ భరిస్తూ, నన్ను రెచ్చకొడుతూ, అనునయిస్తూ తల్లిలాగాచూచి నాఅవసరాలన్నీ అన్నివేళలా కనిపెట్టి ఆదుకుని కంటిరెప్పలా నన్ను కాపాడే గృహిణి కావాలి కల్యాణీ!....మన యిద్దరి జీవితాలూ ఇలా సమాంతరంగా వెళ్ళవలసినవే కాని నీవలా చేయలేవు—అలా కోరటమూ భావ్యంకాదు. నిన్నో సమానురాలైన ఆఫీసరుగా చూచుకోగలనేమో కాని అలా చూడలేను. ఏం చేయమంటావు కల్యాణీ?

ఇప్పుడు నీవుకాదంటే ఆమెతోపాటు నేనూ మరణించాల్సిందే. అంతకంటే గత్యంతరం లేదు. మన యిరువురి జీవితాలూ ఒడిదుడుకులు లేకుండా ఎప్పటిలా గడపాలంటే ఒక్కటే మార్గం....మా వివాహానికి దయతో అంగీకరించు. భార్యవుండగా తిరిగి వివాహమాడటం చట్టవిరుద్ధమని నే నెరుగుదును. అయినా భార్య అనుమతి లేకుండానే మళ్ళీ పెళ్ళికి రహస్యంగా చరించే ప్రబుద్ధుల నెందరినో చూస్తూనే ఉన్నాము....కానీ నేనలా చేయలేను. నీ అనుమతి లేకుండా ఏదనీ చేయను."

హు. ఇదంతా నన్నడిగి చేశారు కాబోలు—ఇదో స్టంటు అనుకుంది కసిగా కల్యాణి.

"ఒకవేళ నేను ప్రమీలను వివాహమాడినా నిన్ను ఇప్పటికంటే భిన్నంగా తక్కువప్రేమతో చూస్తా ననుకోబోకు. నీ తరువాతనే తాను. నీకు వచ్చేనష్టం ఏదీ వుండబోదు....ఇప్పుడయినా మనిద్దరం ఇలా వేరుగానే వుంటున్నాం కదా....మనం రిటైరయిందాకా యిలా చెరో చోట ఉండవలసిందే కదా....నెలకోసారి నేను వచ్చి రెండుమూడు రోజులు ఉండిరావటం తప్ప ఇంకేవిధంగానూ మన జీవితంలో మార్పు ఉండబోదు....ఈ పరిస్థితే నేను భరించలేను. నాకు సర్వదా నా దగ్గరేఉండే సామాన్య స్త్రీ కావాలి కల్యాణీ....ఏమంటావు? ఇలా అడుగుతున్నందుకు నీకు ఎంత బాధగావుందో నే నెరుగుదును. కానీ అడగవలసి వచ్చినందులకు నా కెంత బాధగా ఉందనుకుంటావు? అయినా తప్పటంలేదు....ప్రమీల నిన్నుగురించి అంతా విన్నది. నీ ఆశీస్సుకోసం నిరీక్షిస్తోంది—నీవు కాదంటే మే మిద్దరమూ ఏ విషమో తీసుకోక తప్పదు....నిన్ను అమితంగా ప్రేమించే భర్త గౌరవాన్నీ, నీసాటి స్త్రీప్రాణాలనూ కాపాడలేవా కల్యాణీ? నీ జవాబుకు ఎదురుచూస్తున్నాము. ఏమంటావు కల్యాణీ?"

కన్నీటితో ముగించింది ఉత్తరాన్ని....ఏమంటుంది?ఇంతవరకూవచ్చేలా చేసుకోటమే తప్పు. ఇప్పుడు తాను కాదంటే ఆయన ఆవిడతో కలిసి ఎలాగూ ఆత్మహత్య చేసుకునే తీరుతారు! అంత పట్టుదలమనిషి. అలాంటి పట్టుదలతోనేగా తనవారినందరినీ వదిలివచ్చి తనను పెళ్లాడింది....

సరేనంటుందే పో—నష్టంమటుకేముంది? ఇప్పుడుమాత్రం తాము కలిసి ఒకచోట ఉన్నదేముంది? చుట్టంచూపుగా ఆయనవచ్చి వెళ్లటమేగా....పిల్లలకయినా తండ్రిదగ్గర మాలిమి ఏర్పడేందుకే అవకాశం లేదాయె....ఆయ మంచివారు కాబట్టి చెప్పారు! తనకు చెప్పకుండానే చేసుకుని అక్కడ వేరేకాపరం పెడితే మటుకు తను చేయగలిగేదేమిటి? ఎంతమంది అలా చేయటంలేదు కనక—ఎప్పుడూ కలిసి మెలిసిఉన్నా భార్య ఏ పురిటికో నోములకో పుట్టింటికి వెళ్ళిన వ్యవధిలోనే పెడదోవలుపట్టే వ్యక్తులున్న సమయంలో తన భర్త యింత కాలం కుదురుగా ఉండటమే విశేషం..ఇంతకూ తెచ్చింది తన అధికార వ్యామోహమేగా! మొదట్లో జీతం చాలదనే తనూ ఉద్యోగంలో చేరినా చివరికి ఆయనకు పెద్దఉద్యోగమయాక కూడా తానూ ఉద్యోగం కొనసాగించటానికి కారణం—ప్రమోషనుమీది ప్రలోభమేగా?....

ఇప్పుడేంచేయాలి....జాగ్రతగా స్తిమితంగా తనకి కథతో సంబంధం లేనట్లు తానీ నాటకంలో పాత్రకానట్లు అదేపనిగా తీవ్రంగా ఆలోచించింది....తెల్లవారుజాము నాలుగింటికి ఒక నిశ్చయానికి రాగలిగింది....హృదయభారం తగ్గినట్లయి ప్రశాంతంగా గుండెలమీద చేయివేసుకుని నిద్రపోయింది నందకల్యాణి. ★